క్లుప్తంగా

కోతుల బెడద నివారించండి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఇస్లాంపూర, రంజాన్‌పూస్ కాలనీల్లో కోతులు బెడదను నివారించాలని కాలనీవాసులు బుధవారం అటవీశాఖ అధికారులు నౌసిల్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. చిన్న పిల్లలు, వృద్ధులపై కోతులు దాడులు చేస్తూ.. గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. కోతులను పట్టుకొని అటవీ ప్రాంతాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో సద్దాం హుస్సేన్, అర్షద్, నాసీర్, మోహిద్దిన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల బీభత్సం

తలమడుగు: మండలంలో అడవి పందులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన రైతు రావుల నిఖిల్ రెడ్డి పత్తి పంటను మంగళవారం ధ్వంసం చేశాయి. దాదాపు రెండు ఎకరాల్లోని పత్తి పూర్తిగా ధ్వంసమైంది. అడవి పందుల వల్ల దాదాపు రూ. 40 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ప్రగతి చక్ర అవార్డులు అందజేత

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ డిపోలో కండక్టర్, డ్రైవర్లకు, మెకానిక్‌లకు ప్రగతి చక్ర అవార్డులను బుధవారం ఉట్నూర్ డిపోలో అందించారు. కార్యక్రమానికి ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సాల్మాన్, డిపో మేనేజర్ కల్పన, డిపో ఎస్‌టీఐ వకుంతల, ఆర్‌ఎం కార్యాలయం ఎంఎఫ్ రాజేందర్‌లు అవార్డులు అందచేశారు. ఉత్తమ సేవలు అందించి కండక్టర్ తులసీరాం, రాజమణి, మనోహర్, డ్రైవర్‌లు సలీం, రఫీక్, లక్ష్మణ్ అవార్డులు అందుకున్నారు.

నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వ గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌సింగ్ తిలావత్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శశికళ, కోశాధికారిగా భరత్ చౌహాన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా మద్ది లస్మన్న, రాచకొండ దేవిదాస్‌లను ఎన్నుకున్నారు.

కిడ్నీ పరీక్షలు

బోథ్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో సీహెచ్‌సీ, సొనాల పీహెచ్‌సీ, ఆర్‌బీకెఎస్, పీఎం జన్మాన్ సిబ్బంది బుధవారం గ్రామస్తులకు కిడ్నీ పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ వ్యాధికి సంబంధిత వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తామని బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజనాల రవీంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నవీన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నేరడిగొండ పీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోవడం, నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న డీపీఆర్‌వో

ఆదిలాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా విజయోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఎంపీ నగేశ్‌కు డీపీఆర్‌వో తిరుమల బుధవారం ఆహ్వాన పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆయనను కలిసి, ఈనెల 22న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కళా ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

గుడిహత్నూర్: టిప్పు సుల్తాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని టిప్పు సుల్తాన్ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో ఎస్సై ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మన్నూర్ టిప్పు సుల్తాన్ యూత్ ఆధ్వర్యంలో సైతం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టిప్పు సుల్తాన్ యూత్ అధ్యక్షుడు వసీంఖాన్, సభ్యులు సయ్యద్ జాఫర్, ముకీద్, సాజీద్, జునైద్, నదీం, ఆరీఫ్, మన్నూర్ టిప్పు సుల్తాన్ యూత్ సభ్యులు షేక్ అబ్దుల్, షేక్ ఇర్ఫాన్, అజీజ్ బేగ్, వాజిద్ పాల్గొన్నారు.

పత్తిరైతు చిత్తు..!

- ధరతోపాటు తూకంలోనూ మోసం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం



పత్తి తూకం వేయిస్తున్న దళారి

ఇంద్రవెల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్మకంలోనూ రైతులకు కష్టాలు తప్పడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక దళారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తాము నిర్ణయించిన ధరతోనే రైతులు తీసుకొస్తున్న పత్తిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు నిండా మునుగుతున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల రైతులు ఆరోపిస్తున్నారు.

రూ.. 800 తేడాతో..

అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళారుల చేతిలో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. లైసెన్స్ ఉన్న దళారులతో పాటు అనేక మంది వ్యాపారస్తులు లైసెన్స్ లేకున్నా.. ఇష్టారాజ్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు తీసుకువస్తున్నా.. పంటలను తక్కువ ధరకే కొనుగోలు చేసి నిండా ముంచుతున్నారు. మండలంలో ఏర్పాటు చేసినా.. మూడు జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా క్వింటల్ పత్తి పంటకు రూ. 7521 రూపాయల ధరతో కొనుగోలు చేస్తుండగా.. మండల కేంద్రంలో తమ దుకాణల వద్ద దళారులు ఏర్పాటు చేసిన కాంటాల వద్ద తేమ శాతం పేరుతో కేవలం రూ. 6700 నుంచి రూ. 6800 తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నారు. అలాగే తూకంలో సైతం కోతలు విధిస్తున్నారు. వారు కొనుగోలు చేసి పత్తి పంటను తిరిగి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రూ. 7521 ధరతో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మోసం చేస్తే చర్యలు



పంట అమ్మకంలో రైతులకు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ లేకుండానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన నాలుగు కాంటాలను ఇప్పటికే సీజ్ చేశాం. ప్రస్తుతం ధర విషయంలో కూడా ఎప్పటికప్పుడు లైసెన్స్ పొందిన వ్యాపారస్తుల కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షణ చేసి అన్యాయం జరగకుండా

– దేవన్న, ఏఎంసీ కార్యదర్శి

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెలే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ప్రజాపాలన కళాయాత్ర ప్రజారథాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం అవుతున్నా.. సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో తిరుమల, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ జైవంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీలుగా ఆదివాసీలనే నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలనే సీఆర్టీలుగా నియమించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీ వసంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు మాట్లాడుతూ.. గత సంవత్సరం ఐటీడీఏ అధికారులు సీఆర్టీ ఉద్యోగం కోసం పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. పరీక్షలకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌లో ఉన్న వారికి ప్రస్తుతం కొందరికే సీఆర్టీ ఉద్యోగం ఇస్తున్నారని అందులో లంబాడా వారికి ఇస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట సంఘ నాయకులు అర్క ఓమేశ్, తొడసం ఇస్రు, పెందూర్ శేషరావు, ఆత్రం మారుతి ఉన్నారు.

ఐసీడీఎస్ ఫ్రంట్‌లైన్ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఉట్నూర్‌రూరల్: సెక్యూరింగ్ న్యూట్రిషన్, ఎన్‌హాన్సింగ్ రెసిలెన్స్ (ఎస్‌ఈఎన్‌యూ) ప్రాజెక్టును (జీఐజెడ్) భాస్వామ్యంతో, (జెహెచ్‌పీఐఈజీవో) సహకారంతో భారత ప్రభుత్వం మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తుందని ఉట్నూర్ ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి అన్నారు. ఇందులో భాగంగా ఉట్నూర్ ప్రాజెక్టులో గత రెండు రోజులుగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు ముఖ్య లక్ష్యం గర్భిణి మహిళలు, పాలిచ్చే తల్లులు, పునరుత్పత్తి వయస్సు మహి ళలు, కౌమర బాలికలు, చిన్న పిల్లల పోషకాహార పరిస్థితిని మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.సూపర్‌వైజర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు, శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెహెచ్‌పీఐఈజీవో కన్సల్టెంట్ యోహాన్, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్స్ అబ్దుల్, పురుషోత్తం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించాలని ధర్మ సమాజ పార్టీ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలు ప్రధానంగా వైద్యం, విద్య అందడం లేదన్నారు. ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేదలకు స్థలం కేటాయించి, ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు సుధాకర్, పెందూర్ జల్దేవ్, కలిగేటి ప్రవీణ్ కుమార్, భిక్క రమేశ్, రాథోడ్ నరేందర్, రాజేశ్వర్, స్వామి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటా



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

ఉట్నూర్‌రూరల్: పట్టభద్రులు ఆదరించి గెలిపిస్తే ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపైన మండలిలో గళం విప్పుతానని, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో , ఆదివాసీ వెల్ఫేర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు.

24న గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

ఇచ్చోడ: ఇచ్చోడ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నికను ఈనెల 24న నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకొనున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన రాందాస్‌తో పాటు గజ్జల గంగయ్య సతీమణి రుక్మా ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం ఇరు కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెరుగైన వైద్యం అందించాలి

నేరడిగొండ: వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ తెడ్డు అడెల్లుకు మెరుగైన వైద్యం అందించాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి కోరారు. మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన తెడ్డు అడెల్లు గత కొన్ని రోజులుగా వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన బుధవారం తన వాహనంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఈనెల 28న సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భాషెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయ ప్రారంభోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, సంతోష్, రమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలపై అవగాహన

తలమడుగు: పోలీస్‌స్టేషన్‌లో జరిగే కార్యక్రమాలపై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బరంపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సందర్శించారు. ఎలా ఫిర్యాదు స్వీకరిస్తారు, ఎఫ్‌ఐఆర్ ఎలా నమోదు చేస్తారు, తదితర వివరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన పశు సంతతి



మందులు అందజేస్తున్న ఏడీఏ రామారావు

తాంసి: కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంతతి వృద్ధి చెందుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ రామారావు అన్నారు. భీంపూర్ మండలం అంతర్గాంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువుల గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు చేశారు. పాడితోనే ఆర్థిక పరిపుష్టి అని గుర్తుచేశారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్, సిబ్బంది వినీల్, గజానన్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి నారాయణ

తలమడుగు: ఆత్మవిశ్వాసం అనే ఆయుధంతో మానసిక ఒత్తిడిని చేయించవచ్చని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్ జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన పాటించడం అలవర్చుకోవాలన్నారు. ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేసుకోవడం ద్వారా, ఆయా అంశాలలో వెనుకబడకుండా మేము చేయగలము అనే ఆత్మవిశ్వాసం ఉంటే మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మరో సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ యశోద అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా బుధవారం జైనథ్ మండల కేంద్రంలోని కేజీబీవీలో మానసిక ఒత్తిడి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానసిక ఒత్తిడి కారణంగా చదువుపై ఏకగ్రత తగ్గుతుందన్నారు. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. అనంతరం మండలంలోని దీపాయిగూడ, కూర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘రిజర్వేషన్లు కొనసాగించాలి’



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఎదులాపురం: ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్‌గా ఆదివాసీల రిజర్వేషన్‌లను కొనసాగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం ఆదివాసీల కోసం రిజర్వేషన్‌లను తీసుకొస్తే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే స్వార్థ రాజకీయాల కోసం ఆదివాసీలకు ఇవ్వకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఆదివాసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా రిజర్వేషన్లను తొంగలో తొక్కుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఆదివాసులకు ఆత్మగౌరవం లభించడం లేదన్నారు. జైనథ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీల బాధ్యతలను చైర్మన్‌లకు అప్పగించడం జరిగిందని, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు జైనథ్ మండలానికి చెందిన వ్యక్తికి అప్పగించారని పేర్కొన్నారు. ఇది దేనికి నిదర్శనమో కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఇందులో ఆదివాసీ నాయకులు కుమ్ర జంగు పటేల్, కుమ్ర గులాబ్, హర్క శేషరావు, ముర్తుజా ఖాన్, కినాక సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘సింహగర్జన’ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తలమడుగు: డిసెంబర్ 1న హైదరాబాదులోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ పేరిట జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నిర్వహించే సభను పెద్ద ఎత్తున మాలలు పాల్గొనాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మాలలను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముల్కల రాజేశ్వర్, అశోక్, ప్రహ్లాద్, మలపతి సుభాష్, పాశం రాఘవేంద్ర, మచ్చ రఘు, పోశెట్టి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు రక్షణ కల్పించేందుకే బాలసదనం



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య

ఆదిలాబాద్‌టౌన్: చిన్నారులకు రక్షణ కల్పించేందుకే బాలసదనం ఉందని, గొడవలు పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలసదనంలో బాధితులకు షెల్టర్ ఇవ్వడంలో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాలసదనంలో బాధితులను చేర్పించడం లేదనే ఫిర్యాదుతో తనిఖీ చేయడం జరిగిందన్నారు. గొడవల కారణంగా సిబ్బంది బాధితులను చేర్పించుకోవడం లేదని తెలిసిందని, వెంటనే వారికి మెమోలు జారీ చేయాలని డీడబ్ల్యూవోను ఆదేశించారు. పోక్సో, లైంగిక దాడి, ఇతర బాధిత చిన్నారులకు రక్షణ కల్పించేందుకే ఈ కేంద్రం పని చేస్తుందన్నారు.

కుటుంబ సర్వేకు విశేష స్పందన

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



సర్వేపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

బేల: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, మండలంలో ఇప్పటికే 78.11శాతం సర్వే పూర్తయిందని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఇంటింటా తిరుగుతూ ఎన్యుమరేటర్ చేస్తున్న సర్వేపై పరిశీలన చేశారు. దీంతో పాటు సంబంధిత కుటుంబసభ్యులు చెబుతున్న వివరాలపై ఆరా తీశారు. దీంతో పాటు స్థానిక సబ్ మార్కెట్‌యార్డులో సోయా కొనుగోళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మిగతా సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయిస్తామన్నారు. ఆమె వెంట మండల తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న సభ్యులు

తాంసి: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో భీంపూర్ మండలం ఆర్లి(టి) గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రతీరోజు సాయంత్రం స్నాక్స్ అందించనున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు స్నాక్స్ కోసం రూ.10 వేల రూపాయల నగదును ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మికి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నవీన్ బుధవారం అందజేశారు. ఆయన వెంట గ్రామ పెద్దలు అశోక్, లసయ్య, రహూఫ్, నితిన్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామంలో ఇటీవల శంకరమ్మ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి బుధవారం వసుధ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రూ. 10వేల నగదును మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో వసుధ ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగారాం, మల్లయ్య, పోతయ్య, సంజు, పోశెట్టి పాల్గొన్నారు.